సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

గురువారం । 2 । ఫిబ్రవరి । 2023



విద్యార్థుల హాజరు శాతం మెరుగు

18లో

విద్యార్థుల హాజరు శాతం మెరుగుపడిందని టీడబ్ల్యూడీడీ కొండలరావు తెలిపారు.



నాడు-నేడు పనులు వేగవంతం

18లో

మన బడి నాడు- నేడు పనులను వేగవంతం చేయాలని పీవో గోపాలకృష్ణ ఆదేశించారు.

గుణాత్మక విద్య విస్తృతం



జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో గుణాత్మక విద్యను విస్తృతం చేశామని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ పి.రమేష్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు.

18లో

న్యూస్‌రీల్

గిరిజనాభివృద్ధే లక్ష్యం

సీఆర్పీఎఫ్ బెటాలియన్ కమాండెంట్ సతీష్‌కుమార్

సీలేరు: గిరిజనులు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలన్న లక్ష్యంతో పనిచేస్తున్నామని సీఆర్పీఎఫ్ జీ42 బెటాలియన్ కమాండెంట్ సతీష్‌కుమార్ అన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలో చింతకుప్ప, పులిగుప్ప, గొరిలోవ, కొమ్ములవాడ, బంధవీధి గ్రామాల్లో బుధవారం నిర్వహించిన సివిక్ యాక్షన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గిరిజనులకు దుప్పట్లు, వాటర్‌ట్యాంకులు పంపిణీ చేశారు. మావోయిస్టు పార్టీలో పనిచేస్తున్న కాకూరి పండన్న తల్లి సీతమ్మ వద్దకు పోలీసులు వెళ్లి సరుకులు అందజేశారు. చివరి క్షణంలో తన కొడుకు పండన్నను చూడాలని ఉందని సీతమ్మ కోరడంతో అసిస్టెంట్ కమాండెంట్ సురేష్, జీకే వీధి సీఐ అశోక్‌కుమార్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. పండన్న జనజీవనస్రవంతిలోకి రావాలని, ప్రభుత్వం నుంచి అందాల్సిన అన్ని సదుపాయాలు కల్పిస్తామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ రామకృష్ణ, వైద్యాధికారిణి సౌమ్య, సర్పంచ్ గంగాధర్ పాల్గొన్నారు.

నేటి పొదుపు రేపటికి భరోసా

- బీమాతో కుటుంబానికి ఎంతో మేలు
- పోస్టల్ డివిజనల్ సూపరింటెండెంట్ ప్రసాద్‌బాబు



కేక్ కట్ చేస్తున్న సూపరింటెండెంట్ ప్రసాద్‌బాబు

అరకురూరల్: ప్రతి ఒక్కరూ బీమాపై దృష్టి పెట్టాలని, నేటి పొదుపు రేపటికి భరోసానిస్తుందని అనకాపల్లి పోస్టల్ డివిజనల్ సూపరింటెండెంట్ జె.ప్రసాద్‌బాబు అన్నారు. స్థానిక సబ్ పోస్టాఫీసులో పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ డేను అరకు ఐపీవో బి.ఉపేంద్ర ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ప్రసాద్‌బాబు కేకను కట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్కువ ప్రీమియంతో ఎక్కువ బోనస్ వచ్చే పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్‌ను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ముఖ్యంగా పీఎల్ఐ, ఆర్‌పీఎల్ఐ పాలసీలు వల్ల కుటుంబానికి భద్రత కలుగుతుందన్నారు. పోస్టల్ సేవలపై విస్తృతంగా గ్రామాల్లో అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. పీఎల్ఐ డే సందర్భంగా ఒక్కరోజే రూ.25 కోట్ల విలువైన 31 పీఎల్ఐ పాలసీలు, రూ.83లక్షల విలువైన 35 ఆర్‌పీఎల్ఐ పాలసీలు చేసిన పోస్టల్ సిబ్బందిని ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పీఎంలు, బీపీఎంలు, ఏబీపీఎంలు పాల్గొన్నారు.

అటవీ ఉత్పత్తుల కొనుగోలు



గాసి, జీసీసీ మేనేజర్

పెదబయలు: పెదబయలు గిరిజన సహకార సంస్థ (జీసీసీ)లో గిరిజన రైతులు పండించిన రాగులు(చోళ్లు) తదితర అటవీ ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నట్టు స్థానిక జీసీసీ మేనేజర్ గాసీ చెప్పారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కిలో రాగులు రూ.22 ధరతో కొనుగోలు చేయనున్నట్టు తెలిపారు. రాజ్‌మా (ఎరుపు) కిలో రూ.75, రాజ్‌మా (తెలుపు) రూ.90, సామలు రూ.35, కొర్రలు రూ.35, నరమామిడి బెరడు రూ.20, ఉసిరి పప్పు రూ.55, సీకాయ రూ.50, నల్లజీడిపిక్కలు రూ.10, కాగు పప్పు రూ.22 ధరకు కొనుగోలు చేస్తున్నామన్నారు. చింతపండు కూడా కొనుగోలు చేస్తామని, అయితే ప్రభుత్వం ఇంకా ధర నిర్ణయించలేదన్నారు. గిరిజన రైతులు పండించిన, సేకరించిన పంటలు జీసీసీకి విక్రయించి, గిట్టుబాటు ధరలు పొందవచ్చన్నారు. మండలంలోని డీఆర్ డిపోలు, సంతల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేశామన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

మారేడుమిల్లి: మండలంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బైకు కరెంట్ స్తంభాన్ని ఢీకొని ఓ మహిళ మృతి చెందింది. మారేడుమిల్లి మండలం పుల్లంగి పంచాయితీ పరిధిలోని పాములమామిడి గ్రామానికి చెందిన పల్లాల జ్యోతమ్మ (32), పల్లాల కొమ్మిరెడ్డి, పల్లాల లక్ష్మిరెడ్డి ముగ్గురు కుటుంబ సభ్యులు బైకుపై మారేడుమిల్లి పని నిమిత్తం వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా ఆకుమామిడికోట సమీపంలోని సంగువ కాలువ వద్ద బైకు అదుపు తప్పి రహదారి పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైకుపై ప్రయాణిస్తున్న ముగ్గురూ తీవ్రంగా గాయపడ్డారు. వారిని రంపచోడవరం ఏరియా ఆస్పత్రికి తరలించగా, అందులో జ్యోతమ్మ మృతి చెందింది. మారేడుమిల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆదివాసీ వైద్యానికి భరోసా



ఏజెన్సీలోని వైద్యసేవలు **పూర్తిస్థాయిలో అందుబాటులోకి** వస్తున్నాయి. వీటిపై **ప్రత్యేక దృష్టి సారించిన రాష్ట్ర ప్రభుత్వం ప్రతి** పీహెచ్‌సీలో ఇద్దరు **వైద్యులు ఉండేలా** చర్యలు చేపట్టింది. రెవెన్యూ **డివిజన్** కేంద్రమైన రంపచోడ**వరంలో మల్టీ పర్పస్** సూపర్ స్పెషాలిటీ **వైద్యసేవలు** అందుబాటులోకి తె**చ్చేందుకు** సంకల్పించింది. దీని**లో భాగంగా** చేపట్టిన ఆస్పత్రి భవన **నిర్మాణ పనులు** శరవేగంగా జరుగుతు**న్నాయి. దీంతో** గిరిజనుల్లో ఆనందం **వ్యక్తమవుతోంది.**

- రంపచోడవరంలో **చురుగ్గా మల్టీ పర్పస్** సూపర్ స్పెషాలిటీ **ఆస్పత్రి నిర్మాణం**
- రూ.38.72 కోట్ల**తో పనులు**
- అందుబాటులోకి **రానున్న** పీహెచ్‌సీలకు **భవనాలు**
- ప్రతీ పీహెచ్‌సీకి **ఇద్దరు వైద్యులు**
- మన్యంలో వైద్య **సేవలు బలోపేతానికి** ప్రభుత్వం కృషి



నూతన భవనంలో సీతపల్లి పీహెచ్‌సీ

రంపచోడవరం: రంపచోడవరంలో మల్టీ పర్పస్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి భవన నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయి. నాబార్డులో రూ.38.72 కోట్లు మంజూరైన నిధులతో చేపట్టిన నిర్మాణ పనులు గత ఏడాది మే నెలలో ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది నవంబర్ నాటికి పూర్తికావాల్సి ఉంది. పిల్లర్లస్థాయి వరకు పనులు జరిగాయి. ఇప్పుడున్న స్థానిక ఏరియా ఆస్పత్రిలో వంద పడకలు అందుబాటులో ఉన్నాయి. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి అందుబాటులోకి వస్తే కార్పొరేట్ స్థాయిలో వైద్యసేవలు అందుతాయి. ఇప్పటివరకు అత్యవసర కేసులను రాజమహేంద్రవరం, కాకినాడ రిఫర్ చేసేవారు. మల్టీపర్పస్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి అందుబాటులోకి వస్తే అన్ని రకాల కేసులకు వైద్యం ఇక్కడే అందుతుంది.



రంపచోడవరంలో నిర్మాణ దశలో మల్టీ పర్పస్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి భవనం

పూర్తిస్థాయిలో వైద్యులు..

రంపచోడవరం ఏరియా ఆస్పత్రిలోఇప్పటికే మెరుగైన సేవలు అందుతున్నాయి. ఆర్థోపెడిక్, గైనిక్, కంటి వైద్యం, చిన్నపిల్లలకు సంబంధించి పూర్తిస్థాయిలో వైద్యులు అందుబాటులోకి వచ్చాయి. గత ప్రభుత్వ హయాంలో రంపచోడవరం ఏజెన్సీ ప్రాంతంలో అనారోగ్యంతో బాధపడతున్న గిరిజనులకు వైద్యసేవలందక ప్రాణాలు కోల్పోయారు. అధిక మరణాలు సంభవించిన చాపరాయి గ్రామాన్ని అప్పటిలో ప్రతిపక్ష నేతగా జగన్‌మోహన్‌రెడ్డి సందర్శించారు. గిరిజనులు సమస్యలు తెలుసుకున్నారు. అప్పటిలోనే సమస్య గుర్తించిన ఆయన అధికారంలోకి వచ్చిన వెంటనే ఏజెన్సీలో వైద్యసేవలకు అధిక ప్రాధాన్యమిచ్చారు.

తీరనున్న వసతి సమస్య

ఏజెన్సీలో గంగవరం, సీతపల్లి, పెద్దబియ్యంపల్లి, వెలగపల్లి, దుప్పిలపాలెం, మంగంపాడు గ్రామాల్లోని పీహెచ్‌సీలకు కొత్త భవనాలు మంజూరు చేశారు. వీటిలో సీతపల్లిలో కొత్తగా ఏర్పాటు చేసిన పీహెచ్‌సీ భవన నిర్మాణం పూర్తయింది. ప్రారంభానికి సిద్ధంగా ఉంది.

- గంగవరం, దుప్పిలపాలెం, పెద్దబియ్యంపల్లిలో కూడా భవనాలు పూర్తయ్యాయి. అలాగే మంగంపాడు, వెలగలపల్లిలోని పీహెచ్‌సీ భవనాలు నిర్మాణ దశలో ఉన్నాయి. పూర్తయిన భవనాలకు ప్రభుత్వం ఫర్నిచర్ సరఫరాకు కసరత్తు జరుగుతోంది.

ప్రతీ పీహెచ్‌సీకి ఇద్దరు వైద్యులు..

ఏజెన్సీలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో (పీహెచ్‌సీ) వైద్యుల పోస్టులు ఏళ్ల తరబడి ఖాళీగా ఉండేవి. వైద్యుడు సెలవు పెడితే ఆ రోజు ఆస్పత్రికి వచ్చిన రోగులకు అక్కడ ఉన్న సిబ్బంది వైద్య సేవలు అందించాలి. రాష్ట్ర ప్రభుత్వ చర్యలతో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ఖాళీ పోస్టులను భర్తీ చేసింది. ప్రతీ పీహెచ్‌సీకి ఇద్దరు వైద్యులు ఉండేలా నియామకాలు చేపట్టింది.

- రంపచోడవరం ఐటీడీఏ పరిధిలో 19 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. ప్రతి పీహెచ్‌సీకి ఇద్దరు వైద్యులు చొప్పున 38 మంది సేవలు అందిస్తున్నారు. ఫ్యామిలీ హెల్త్ కాన్సెప్ట్‌లో భాగంగా గ్రామ స్థాయిలో వైద్య సేవలు అందించేందుకు చేపట్టిన పూర్తిస్థాయిలో వైద్యుల నియామకం ఎంతో దోహదపడుతోంది.

మెరుగైన వైద్య సేవలు

ఏజెన్సీలో గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి జరుగుతోంది. ఏజెన్సీలో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులను ప్రభుత్వం ఇటీవల భర్తీ చేసింది. దీంతో ఏజెన్సీ పీహెచ్‌సీల్లో ప్రతీచోట ఇద్దరు వైద్యులు అందుబాటులో ఉన్నారు. ఫ్యామిలీ హెల్త్ కాన్సెప్ట్ ద్వారా గ్రామాల్లో వైద్య సేవలు అందుతున్నాయి. పీహెచ్‌సీల్లో మందులు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నాయి.

– డాక్టర్ అనూష, ఏడీఎంహెచ్‌వో, రంపచోడవరం

మొక్కుబడిగా విధులు నిర్వహిస్తే చర్యలు

డీఎల్పీవో కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్పీవో కుమార్

చింతపల్లి: పంచాయతీ కార్యదర్శులు మొక్కుబడిగా విధులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎల్పీవో కుమార్ హెచ్చరించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉద్యోగులు విధిగా ముఖ ఆధారిత హాజరు తప్పకుండా నమోదు చేసుకోవడంతో పాటు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. గ్రామాల్లో తాగునీరు, పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. మంచినీటి బోర్ల నిర్వాహణను మండల పరిషత్‌లు, మంచినీటి పథకాల బాధ్యతను పంచాయతీలు చేపట్టాలని సూచించారు. వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. జల్‌జీవన్ మిషన్, గడప గడపకు మన ప్రభుత్వంలో భాగంగా మంజూరైన పనులు సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. పన్నుల వసూలు చేసి పారిశుధ్య కార్మికులకు వేతనాలు చెల్లించాలని, బీమా క్లెయిమ్‌ల పరిష్కారానికి వీలుగా మరణ ధ్రువీకరణ పత్రాలు సకాలంలో అందజేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో లాలం సీతయ్య, ఈవోపీఆర్డీ కొరుప్రోలు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

లోయలోకి దూసుకెళ్లిన కారు

- పర్యాటకుల్లో ఒకరు మృతి
- ఇద్దరికి స్వల్పగాయాలు
- మన్యం అందాలను తిలకించి తిరిగి వెళ్తుండగా ప్రమాదం



మురళి మృతదేహం



ప్రమాదానికి గురైన కారు

అనంతగిరి: మన్యం అందాలను తిలకించేందుకు వచ్చిన పర్యాటకుల కారు ప్రమాదానికి గురయ్యింది. అదుపు తప్పి లోయలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా, ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. అనంతగిరి ఘాట్‌రోడ్డు డముకు గ్రామ సమీపంలోని హెయిర్‌పిన్‌బెండ్ ఆరవ మలుపువద్ద బుధవారం ఉదయం నాలుగు గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలిలావున్నాయి. కర్ణాటకలోని కొల్లార్ పట్టణానికి చెందిన మురళి, అర్జున్, శ్రీకాంత్ అనే ముగ్గురు స్నేహితులు మన్యం అందాలను తిలకించేందుకు వచ్చారు. మంగళవారం విశాఖపట్నంలో కారు అద్దెకు తీసుకుని డ్రైవింగ్ చేసుకొని అరకులోయకు వచ్చారు. పర్యాటక ప్రాంతాలను తిలకించిన తరువాత బుధవారం తెల్లవారుజామున విశాఖపట్నం బయలుదేరారు. డముకు సమీపంలోని హెయిర్ పిన్‌బెండ్ మలుపువద్దకు వచ్చేసరికి కారు అదుపు తప్పి లోయలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో మురళి (27) సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. అర్జున్, శ్రీకాంత్ స్వల్పగాయాలతో బయటపడ్డారు. స్థానికుల సమాచారం మేరకు అనంతగిరి పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్‌కోట సీహెచ్‌సీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పొగమంచు, ఘాట్‌రోడ్డుపై అవగాహన లేకపోవడమే ప్రమాదానికి కారణం కావొచ్చని పోలీసులు భావిస్తున్నారు.

ఊపిరాడక శిశువు మృతి

రాజవొమ్మంగి: మండలంలోని బడదనాంపల్లి పంచాయతీ కొత్తవీధి గ్రామంలో ఎల్లెం దేవికి మొదటి కాన్పులో పుట్టిన రెండు నెలల బాబు ఊపిరి ఆడక బుధవారం మృతి చెందాడు. ఉన్నట్లుండి తీవ్ర అస్వస్థతకు గురైన బాబును తల్లిదండ్రులు దేవి, కిషోర్ కుమార్ వెంటనే స్థానిక పీహెచ్‌సీకి తీసుకువచ్చారు. డాక్టర్ శ్రీదుర్గ పరీక్షించారు. పరిస్థితి విషమంగా ఉందని గ్రహించిన వెంటనే అడ్డతీగలలోని నవజాత శిశు సంరక్షణ కేంద్రానికి రిఫర్ చేశారు. బాబును అంబులెన్సులో తరలిస్తుండగా మార్గం మధ్యలోనే మృతి చెందాడు. బాబును పడుకోబెట్టి పాలు పట్టించడం వల్ల ఊపిరితిత్తుల్లోకి వెళ్లి అస్వస్థతకు గురై చనిపోయి ఉండవచ్చని పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ శ్రీదుర్గ వివరణ ఇచ్చారు.

పింఛను పంపిణీ @ 63.48 శాతం

- తొలిరోజు 79,216 మందికి అందజేత
- వేకువజామునే పింఛనుదారుల ఇళ్లకు వెళ్లిన వలంటీర్లు



కాడెలి గ్రామంలో వృద్ధురాలికి పింఛను అందజేస్తున్న వలంటీర్ శ్రీకాంత్

సాక్షి,పాడేరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న వైఎస్సార్ పింఛన్ కానుకను బుధవారం వేకువజామునుంచి గ్రామ వలంటీర్లు పంపిణీ చేపట్టారు. తొలిరోజు సాయంత్రం వరకు 79,216 మంది పింఛనులకు పంపిణీ చేయడంతో 63.48శాతం నమోదైంది. జిల్లాలో 22 మండలాల్లో 1,24,783 మంది పింఛనుదారులు ఉన్నారు. తొలిరోజు పింఛన్ల పంపిణీలో కూనవరం మండలం ప్రథమస్థానంలో నిలిచింది. పింఛనుదారులు 3855 మందిలో 3,377 మందికి పంపిణీ పూర్తి చేశారు. అలాగే వీఆర్‌పురం మండలంలో 3574మందికి 3040 మందికి అందజేయడంతో రెండవ స్థానంలో నిలిచింది. జిల్లా వ్యాప్తంగా మిగిలిన పింఛనుదారులకు గురు,శుక్రవారాల్లో పూర్తిచేయాలన్న లక్ష్యంతో వలంటీర్లు ఉన్నారు.

మరింత చేరువగా సేవలు

- ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర
- జెడ్పీ క్యాంపు కార్యాలయం ప్రారంభం



జెడ్పీ క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్ల భాగ్యలక్ష్మి

సాక్షి,పాడేరు: పాడేరు డివిజన్ పరిధిలోని గిరిజనులకు చేరువగా జిల్లా పరిషత్ సేవలను అందుబాటులోకి తెస్తున్నామని ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర తెలిపారు. 15వ ఆర్థిక సంఘ నిధులు రూ.15 లక్షలతో జెడ్పీ అతిథి గృహం వద్ద నిర్మించిన జెడ్పీ క్యాంపు కార్యాలయాన్ని బుధవారం పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మితో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏజెన్సీ నుంచి ప్రజలు జిల్లా పరిషత్ పనుల నిమిత్తం విశాఖ రావడానికి చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా ఏర్పడిన తరువాత పాడేరులోను జెడ్పీ క్యాంపు కార్యాలయం ఏర్పాటుకు చర్యలు తీసుకున్నామన్నారు. క్యాంపు కార్యాలయం సేవలను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు పరిపాలనను మరింత చేరువ చేయాలన్న మంచి ఆశయంతో కొత్త జిల్లాలను ఏర్పాటు చేశారన్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా అన్ని గ్రామాలకు పరిపాలన పరంగా న్యాయం జరుగుతుందన్నారు. జెడ్పీ క్యాంపు కార్యాలయం ప్రారంభం కావడం, జెడ్పీ చైర్‌పర్సన్‌తో పాటు అధికారులు అందుబాటులోకి రావడం గిరిజనులకు మరింత మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జీసీసీ చైర్‌పర్సన్ డాక్టర్ శోభ స్వాతిరాణి, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నర్సింగరావు, జెడ్పీ సీఈవో శ్రీరామమూర్తి, ఎంపీపీ సొనారి రత్నకుమారి, వైస్ ఎంపీపీ కనకాలమ్మ, హుకుంపేట జడ్పీటీసీ రేగం మత్స్యలింగం, ఏఎంసీ చైర్మన్ కూతంగి సూరిబాబు, మండల పార్టీ అధ్యక్షుడు సీదరి రాంబాబు, ఏఎంసీ డైరెక్టర్లు రామసత్యవతి, గబ్బాడ రాజా రావు, ఎంపీటీసీలు రామకృష్ణపాత్రుడు, చిట్టమ్మ, సర్పంచ్‌లు పార్వతమ్మ, సీతమ్మ, నీలకంఠం, బసవన్నదొర, వంతాల రాంబాబు పాల్గొన్నారు.

వసతుల మెరుగుకు చర్యలు

చింతపల్లిరూరల్: జెడ్పీ అతిథి గృహంలో వసతులు మరింత మెరుగుకు చర్యలు తీసుకుంటామని జెడ్పీ డిప్యూటీ సీఈవో సత్యనారాయణ తెలిపారు. బుధవారం స్థానిక జెడ్పీ అతిథి గృహాన్ని సందర్శించారు. ఇటీవల రూ.5 లక్షలతో చేపట్టిన మరమ్మతు పనులు, అదనపు హంగులను ఆయన పరిశీలించారు. మరిన్ని సౌకర్యాల కల్పనకు చర్యలు చేపడతామన్నారు. అనంతరం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సౌకర్యాలను ఆయన పరిశీలించారు. ఎంపీడీవో సీతయ్య పాల్గొన్నారు.


విశాఖపై సీత కన్ను!

- రైల్వే జోన్ ఊసే లేదు..
- మెట్రో రైలు ప్రతిపాదనలు బుట్టదాఖలు
- 'భోగాపురాన్ని' విస్మరించిన ఆర్థిక మంత్రి
- స్టీల్‌ప్లాంట్‌కు రూ.683 కోట్లు..
- పెట్రోలియం యూనివర్సిటీకి రూ.168 కోట్లు..
- వీపీఏకు రూ.337 కోట్ల కేటాయింపు
- కేంద్ర బడ్జెట్‌లో విశాఖకు మొండి చెయ్యి
- అల్లూరి జిల్లాలో 17 ఏకలవ్య పాఠశాలలకు మేలు చేకూరే అవకాశం

సాక్షి, విశాఖపట్నం: కేంద్ర బడ్జెట్ అంటే ఎన్నెన్నో ఆశలు.. మరెన్నో ఆకాంక్షలు.. అందుకే ఈ బడ్జెట్‌లో తమకు, తమ ప్రాంతానికి మేలు జరుగుతుందని ఎంతగానో ఎదురు చూస్తారు. కానీ బుధవారం నాటి బడ్జెట్‌లో కేంద్ర ఆర్థిక శాఖామంత్రి నిర్మలా సీతారామన్ విశాఖపై సీతకన్నే వేశారు. అరకొర కేటాయింపులతోనే సరిపెట్టారు. ఈ బడ్జెట్‌లో స్టీల్‌ప్లాంట్‌కు రూ.683 కోట్లు, పెట్రోలియం విశ్వవిద్యాలయానికి రూ.168 కోట్లు కేటాయించి చేతులు దులుపుకున్నారు. విశాఖ పోర్టు అథారిటీ (వీపీఏ)కి మాత్రం రూ.337.69 కోట్లు కేటాయించారు. గత ఏడాది బడ్జెట్‌లో వీపీఏకు రూ.158.39 కోట్ల కేటాయింపులు జరిగాయి. ఇక ఎన్నో ఆశలు పెట్టుకున్న వాటికి మాత్రం బడ్జెట్‌లో ఆర్థికమంత్రి కనికరం చూపలేదు. విశాఖకు దక్షిణ కోస్తా రైల్వే జోన్‌ను ప్రకటించి నాలుగేళ్లు దాటింది. కానీ ఈ బడ్జెట్‌లో విశాఖ రైల్వే జోన్ జోలికే వెళ్లలేదు. ఈ బడ్జెట్‌లోనైనా రైల్వే జోన్‌కు నిధులు కేటాయిస్తారని గంపెడాశలు పెట్టుకున్న విశాఖ వాసులకు నిరాశ మిగిల్చారు. విశాఖకు కొత్తగా రైల్వే ప్రాజెక్టుల కేటాయింపూ లేదు. మెట్రో రైలు ప్రతిపాదనలను కూడా బుట్టదాఖలు చేశారు. ప్రతిష్టాత్మక భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయానికి నిధుల కేటాయింపు పైనా ప్రస్తావన లేదు. సాధారణంగా కేంద్ర బడ్జెట్‌లో వెనబడిన జిల్లాల అభివృద్ధికి నిధుల కేటాయింపు జరుగుతుంది. ఈ బడ్జెట్‌లో వెనుకబడిన ఉత్తరాంధ్ర జిల్లాలకు ఆ నిధుల కేటాయింపు ఉంటుందని తద్వారా విశాఖ అభివృద్ధికి దోహద పడుతుందని ఆశించారు. అయితే ఈ ఆశలపై కూడా నిర్మలా సీతారామన్ నీళ్లు చల్లేశారు.

వీటిపైనే కొన్ని ఆశలు

ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఆఫ్ టూరిస్ట్ సర్క్యూట్స్ కింద ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించారు. ఈ నిధులు మంజూరైతే విశాఖ నగరం, జిల్లాతో పాటు అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో పర్యాటక రంగం అభివృద్ధికి వీలుకానుంది. ఏకలవ్య పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, బోధన సిబ్బంది పెంపు వంటి వాటికి బడ్జెట్‌లో ప్రాధాన్యం ఇవ్వడం వల్ల అల్లూరి సీతారామరాజు జిల్లాలోని 17 స్కూళ్లకు ప్రయోజనం చేకూరే అవకాశం ఉంది. మరోవైపు కేంద్ర బడ్జెట్‌లో ఈ ప్రాంతానికి జరిగిన అన్యాయంపై సీపీఐ ఆధ్వర్యంలో విశాఖ రైల్వే స్టేషన్ ప్రధాన ద్వారం వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. విశాఖ పట్ల కేంద్ర వైఖరిపై మండిపడ్డారు.



విశాఖ స్టీల్‌ప్లాంట్

ఫీల్ గుడ్ బడ్జెట్



కేంద్ర బడ్జెట్ ఫీల్ గుడ్.. నో హార్మ్ బడ్జెట్.. దేశ ఆర్థిక పరిస్థితి మెరుగు పడడానికి దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని రూపొందించారు. ప్రధానంగా తయారీ రంగం వృద్ధికి అధిక ప్రాధాన్యం లభించింది. మొబైల్ పరికరాల దిగుమతి సుంకం తగ్గించడంతో వీటి తయారీ పెరిగి, ధర తగ్గుతుంది. మొబైల్ తయారీ రంగంలో ప్రపంచంలో నంబర్ వన్ కావడానికి వీలవుతుంది. తక్కువ ఆదాయ వర్గాలకు పన్ను తగ్గింపు, అధిక ఆదాయ వర్గాలకు సర్‌చార్జీల తగ్గింపుతో సమతుల్యత పాటించారు. ఎంఎస్ఎంఈలు వృద్ధి చెందే నిర్ణయాలతో కొత్త పరిశ్రమల ఏర్పాటై ఉద్యోగావకాశాలు పెరుగుతాయి. వ్యవసాయ రంగం గిట్టుబాటుకు చర్యల్లో భాగంగా చిరుధాన్యాల సాగును ప్రోత్సహించడంతో వీటి ఎగుమతులు పెరిగి రైతులకు మంచి ధర లభిస్తుంది.

– ఆకుల చంద్రశేఖర్, ఫౌండర్ పార్టనర్, సార్క్ అండ్ అసోసియేట్స్

ఏఐకి ప్రాధాన్యత హర్షణీయం



ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సెంటర్లను ఏర్పాటు చేయాలన్న కేంద్ర నిర్ణయం హర్షణీయం. ఇది గేమ్ ఛేంజర్ అవుతుంది. దేశంలో 30 నైపుణ్య కేంద్రాలను ఏర్పాటు చేస్తుండడమూ ముదావహమే. అయితే 5 మిలియన్ల ఐటీ వర్క్‌ఫోర్స్ ఉన్నా 0.3 మిలియన్ల మంది మాత్రమే సముచిత నైపుణ్యాలతో ఉన్నారు. అన్ని నైపుణ్య రంగాల్లో ఒక మోడల్ పని చేయదు. 5జీ యాప్స్, కొత్త డాటా పాలసీతో డీప్ టెక్ పర్యావరణ వ్యవస్థకు సహాయకరంగా ఉంటుంది.

–శ్రీధర్ కొసరాజు, రాష్ట్ర అధ్యక్షుడు, ఐటీ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్

క్లుప్తంగా

రైలు కింద పడి వ్యక్తి మృతి


మృతి చెందిన గుర్తుతెలియని వ్యక్తి

పాయకరావుపేట: నాగరాజుపేట గేటు సమీపాన రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్టు 108 సిబ్బంది తెలిపారు. బుధవారం రాత్రి రైలు కింద పడడంతో రెండు కాళ్ళు నలిగిపోయి మృతి చెందినటు చెప్పారు. తమకు అందిన సమాచారం మేరకు పరిశీలించి, తుని రైల్వే పోలీసులకు సమాచారం అందించామన్నారు. తుని రైల్వే పోలీసులను సంప్రదించగా సమాచారం తెలిసిందని, పూర్తి వివరాలు తెలియాల్సి ఉందని అన్నారు.

మంటల్లో చిక్కుకుని వ్యాన్ డ్రైవర్ సజీవ దహనం

నర్సీపట్నం: నెల్లూరు జిల్లా కావలి వద్ద నర్సీపట్నం నుంచి కాఫీ పిక్కల లోడుతో వెళ్తున్న వ్యాన్‌లో మంటలు వ్యాపించి డ్రైవర్ సజీవ దహనమయ్యాడు. నర్సీపట్నం, గచ్చపు వీధికి చెందిన డ్రైవర్ కాకినాడ బెన్నేష్(65) కాఫీ పిక్కల లోడు తీసుకుని తిరుపతి వెళ్తున్నారు. నెల్లూరు జిల్లా కావలి వద్దకు వెళ్లే సరికి ముందువెళ్తున్న లారీ సడన్ బ్రేక్ వేయడంతో లోడు వ్యాన్ ఢీకొట్టింది. వ్యాన్‌లో ఉన్న గ్యాస్ సిలిండర్ ఫైర్ అయి వ్యాన్‌లో మంటలు వ్యాపించాయి. వ్యాన్‌లో ఉన్న మరో డ్రైవర్ ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. వ్యాన్ నడుపుతున్న బెన్నేష్ వయస్సు రీత్యా తప్పించుకోలేక మంటల్లో చిక్కుకుని సజీవదహనమయ్యాడు.

మెరుగైన పౌష్టికాహారం అందించాలి

డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్ బాషా

పాడేరు రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు మెరుగైన పౌష్టికాహారం అందించాలని డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్ బాషా సూచించారు. మండలంలోని ఈదులపాలెం పీహెచ్‌సీ పరిధిలోని వంట్లమామిడి గ్రామంలోని వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ను ఆయన బుధవారం తనిఖీ చేశారు. మందుల నిల్వలపై ఆరా తీశారు. ఫీడర్ అంబులెన్స్‌ను పరిశీలించారు. గర్భిణులు, శిశువులకు వేస్తున్న వాక్సినేషన్ ప్రక్రియనును పరిశీలించారు. సకాలంలో వాక్సినేషన్ జరిగేలా చూడాలని సిబ్బందికి ఆదేశించారు. ప్రసవాలకు సిద్ధంగా ఉన్న గర్భిణులను తక్షణమే బర్త్ వెయిటింగ్ కేంద్రాలకు తరలించాలని, ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే సుఖ ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. మాతా, శిశు మరణాల నివారణకు వైద్యారోగ్య శాఖ, అంగన్వాడీల ద్వారా తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. అనంతరం మలకపాలెం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థుల ఆరోగ్యంపై అడిగి తెలుసుకున్నారు.


విద్యార్థుల ఆరోగ్యంపై అరా తీస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్ బాషా

విద్యార్థులకు ప్రతి రోజు వేడి చేసిన తాగునీరు అందించాలని, వసతి గృహం, కిచెన్, మరుగుదొడ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని నిర్వాహకులను ఆదేశించారు. ఆయన వెంట జిల్లా టీబీ పర్యవేక్షకులు వి.కిరణ్, సిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది ఉన్నారు.

విలేజ్ హెల్త్ క్లినిక్‌లో ఏడీఎంహెచ్‌వో తనిఖీ

మినుములూరు పీహెచ్‌సీ పరిధిలోని తుంపాడ వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లీనిక్‌ను ఏడీఎంహెచ్‌వో డాక్టర్ లీలాప్రసాద్ తనిఖీ చేశారు. గర్భిణులు, శిశువులకు జరుగుతున్న వాక్సినేషన్‌ను పరిశీలించారు. వంతాడపల్లిలో ఫ్యామిలి ఫిజిషియన్ వైద్య శిబిరాన్ని సందర్శించారు. ఎయిడ్స్, లెప్రసీ, క్షయ జిల్లా అధికారి డాక్టర్ విశ్వేశ్వరనాయుడు, ఎపిడమిక్ సెల్ ఆరోగ్య విస్తరణాధికారి గుల్లెల సింహాద్రి తదితరులున్నారు.

ఏజెన్సీలో వైద్య సేవలు బలోపేతం

రంపచోడవరం: ఏజెన్సీలో వైద్య సేవలు బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. సీతపల్లిలో నూతనంగా నిర్మించిన పీహెచ్‌సీ భవనాన్ని ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏజెన్సీలో వైద్య సేవలు బలోపేతంగా చేసే దిశగా రంపచోడవరంలో మల్టీ పర్పస్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి మంజూరు చేశామన్నారు. దీని నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో స్పెషాలిస్టు పోస్టులు భర్తీ చేశామన్నారు. గిరిజనులకు వైద్య సేవలు అందుబాటులో ఉండాలనే లక్ష్యంతో సీతపల్లిలో కొత్తగా పీహెచ్‌సీ మంజూరు చేయడం జరిగిందన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో గ్రామస్థాయిలో వైద్య సేవలు అందుతున్నాయన్నారు.


సీతపల్లిలో పీహెచ్‌సీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి

విద్యార్థుల హాజరు శాతం మెరుగు

- అందుకు తగ్గట్టుగా బోధన
- గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ కొండలరావు ఆదేశం
- పాఠశాలల ఆకస్మిక తనిఖీ

సాక్షి,పాడేరు: పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం మెరుగుపడినందున అందుకు తగ్గట్టుగా శ్రమించి బోధన చేయాలని గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ ఐ.కొండలరావు సూచించారు. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆయన పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల్లోని మారుమూల ప్రాంతాల్లో సుడిగాలి పర్యటన చేశారు. గిరిజన సంక్షేమ ప్రాథమిక, ఆశ్రమ పాఠశాలలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కిముడుపల్లి గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలతో పాటు సమీపంలోని ప్రాథమిక పాఠశాలలు, గోమంగిలోని మినీ గురుకులం, అత్యంత మారుమూల గిన్నెలకోట, బంగారుమామిడి, ఇనుపతీగలు, చామగెడ్డ ప్రాథమిక పాఠశాలలను తనిఖీ చేశారు. అలాగే బూసిపుట్టు, రూడకోట ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులతో సమావేశమయ్యారు. రోజువారీ ఉపాధ్యాయుల హాజరు, బోధన కార్యక్రమాలు, మెనూ ప్రకారం ఆహారం పంపిణీ తదితర అంశాలపైన క్షేత్రస్థాయిలో సమీక్షించారు. అన్ని రికార్డులను డీడీ తనిఖీ చేశారు. విద్యార్థుల సంక్షేమమే లక్ష్యంగా నాణ్యమైన ఆహారం పంపిణీ చేయాలని ఆదేశించారు.


బూసిపుట్టులో పాఠశాల రికార్డులను పరిశీలిస్తున్న గిరిజన సంక్షేమ డీడీ కొండలరావు

నిరుద్యోగులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ


శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మాజీ వార్డు సభ్యుడు జిన్ను

అరకులోయ రూరల్: నిరుద్యోగులకు ఉచిత కంప్యూటర్ శిక్షణతో స్వయం ఉపాధి కల్పిస్తామని ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ దీసరి బుద్దు అన్నారు. మండలంలో చినలబుడు పంచాయతీ హట్టగూడ గ్రామంలో బెంగుళూరుకు చెందిన ఎఫ్‌వీటీఆర్ఎస్ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఆసక్తి గల యువతీ యువకులు ఉచిత కంప్యూటర్ శిక్షణ సద్వినియోగం చేసుకోవాలన్నారు. మూడు నెలలు శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సంస్థ నుంచి శిక్షణ ధ్రువ పత్రం అందజేస్తామన్నారు. అర్హులైన వారు శిక్షణ కేంద్రంలో పూర్తి సమచారం కోసం సంప్రదించాలన్నారు. అప్పారావు, భగత్ తదితరులు పాల్గొన్నారు.

నాడు-నేడు పనులు వేగవంతం

ఐటీడీఏ పీవో గోపాలకృష్ణ

పాడేరు రూరల్: ప్రభుత్వ ప్రాధాన్య భవన నిర్మాణాలు, మన బడి నాడు- నేడు పనులను వేగవంతం చేయాలని ఐటీడీఏ పీవో ఆర్. గోపాలకృష్ణ ఆదేశించారు. బుధవారం 11 మండలాల ఇంజనీరింగ్ అధికారులు, ఎంపీడీవోలు, ఏటీడబ్ల్యూవోలు, ఎంఈవోలు, సీడీపీవోలు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాళ్లు, గృహ నిర్మాణ శాఖ అధికారులు, ఉపాధి హామీ పథకం అధికారులతో ఐటీడీఏ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తాగునీటి పథకాలు, అంగన్‌వాడీ కేంద్ర భవనాల నిర్మాణం, మన బడి నాడు- నేడు పనులు, ఉపాధి హామీ , గృహ నిర్మాణాలు, జగనన్న స్వచ్ఛ సంకల్పం తదితర పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న మూడు నెలలో తాగునీటి సమస్య లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని గ్రామీణ నీటి సరఫరా విభాగం అధికారులను ఆదేశించారు. పాడేరు డివిజన్‌లో 44 వేల మంది ఉపాధి పనులు చేస్తున్నారని, వ్యవసాయ పనులు పూర్తయినందున పెద్ద ఎత్తున ఉపాధి పనులు కల్పించాలని సూచించారు. జాబ్ కార్డు ఉన్న ప్రతి గిరిజన కుటుంబానికి 100 రోజుల పని దినాలు కల్పించాలని ఆదేశించారు. అధికారులు క్షేత్ర స్థాయి పర్యటనలు చేసి పనుల్లో పురోగతి సాధించాలని సూచించారు. గృహ నిర్మాణ శాఖ అధికారులు లబిదారులకు సహాయ సహకారాలు అందించి సకాలంలో పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు. చింతపల్లి-సీలేరు రోడ్డు, కంద్రుం, జామిగూడ రోడ్ల పురోగతిపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. రహదారుల మధ్యలో ఉన్న కల్వర్టు పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో డీఎల్పీవో పీఎస్ కుమార్, గిరిజన సంక్షేమ శాఖ ఈఈ డీవీఆర్ఎంరాజు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ లీలాకృష్ణ, పంచాయతీరాజ్ ఈఈ లావణ్యకుమార్, ఆర్అండ్‌బీ ఈఈ బాలసుందర్‌బాబు, హౌసింగ్ పీడీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

గుణాత్మక విద్య విస్తృతం

జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ రమేష్

సాక్షి,పాడేరు: జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో గుణాత్మక విద్యను విస్తృతం చేశామని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ పి.రమేష్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యం ఇస్తుందని, ఈ మేరకు ఉపాధ్యాయులంతా నాణ్యమైన విద్యను బోధించాలనే లక్ష్యంతో ఉందన్నారు. ప్రభుత్వ లక్ష్యాలకు తగ్గట్టుగానే జిల్లా వ్యాప్తంగా పాఠశాలల తనిఖీలు చేపట్టి ప్రభుత్వానికి నివేదిస్తున్నామన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన చింతపల్లి, జి.కే.వీధి మండలాల్లో పలువురు ఉపాధ్యాయులకు నోటీసులు జారీ చేసినట్టు తెలిపారు. ఫేషియల్ యాప్‌లో ఉపాధ్యాయుల ఫొటోల నమోదు కార్యక్రమం కూడా జిల్లాలో విజయవంతంగా జరుగుతుందన్నారు. ఫేసియల్ యాప్‌లో హాజరు నమోదు ఆధారంగా జీతాలు చెల్లించే కార్యక్రమాన్ని పైలెట్ ప్రాజెక్టుగా తొలుత కేజీబీవీ పాఠశాలల్లో ప్రభుత్వం అమలుజేస్తుందన్నారు. దీంతో కేజీబీవీ పాఠశాలల పనితీరు గతంలో కన్నా మెరుగుపడిందని తెలిపారు. అలాగే జిల్లాలోని 6,7,8 తరగతి విద్యార్థులకు మరింత బోధన కార్యక్రమాలను చేపడుతున్నామని, ఇందుకు ఆయా పాఠశాలల్లో 200 మంది ఉపాధ్యాయుల సేవలను ప్రత్యేకంగా వినియోగించుకుంటున్నామని ఆయన తెలిపారు. టెన్త్‌లో నూరుశాతం ఫలితాలకు ఉపాధ్యాయులు శ్రమిస్తున్నారన్నారు. అన్ని యాజమాన్య పాఠశాలల్లో టెన్త్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారని, ప్రభుత్వం అందుబాటులో తెచ్చిన విద్యా భారతి స్టడీ మెటిరియల్‌ను పంపిణీ చేస్తున్నామని ఆయన తెలిపారు.

వలంటీర్ సేవాభావం


కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న వృద్ధుడికి పింఛన్ ఇస్తున్న వలంటీర్ సూర్యప్రకాష్

హుకుంపేట: అల్లూరి జిల్లా అరకు నియోజకవర్గం హుకుంపేట మండలంలోని కొంతిలి గ్రామానికి చెందిన పాంగి పొట్టన్న అనే వృద్ధుడు కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ద్వారా మంజూరైన పింఛన్‌ను బుధవారం కొంతిలి గ్రామ వలంటీర్ సూర్యప్రకాష్ బుధవారం కేజిహెచ్‌కు వెళ్లి పొట్టన్నకు నగదును అందజేశారు.

ఒడిశా సరిహద్దులో గుర్తు తెలియని మృతదేహం లభ్యం


ఒడిశా సరిహద్దులో లభ్యమైన మృతదేహం

హుకుంపేట: ఆంధ్రా–ఒడిశా సరి హద్దు ప్రాంతం, ఒడిశా రాష్ట్రానికి చెందిన సూడుబు, ముక్తిమామిడి గ్రామలకు మధ్యలో ప్రధాన రహదారి పక్కన ఓ గుర్తు తెలియని మృతదేహం బుధవారం లభ్యమైంది. ఆ ప్రాంత వాసులు పశువులు మేపడానికి వెళ్లగా దుర్వాసన రావడంతో గమనించి చూడగా రోడ్డు పక్కనే ఓ మృతదేహం కుళ్లిన స్థితిలో కనిపించింది. ఈ విషయాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రాంతానికి చెందిన గరుడాపల్లి, కామయ్యపేట తదితర గ్రామస్తులు తెలుసుకుని హుకుంపేట ఎస్‌ఐ సతీష్‌కు సమాచారం అందించారు. ఎస్‌ఐ సంఘటన స్థలానికి వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహం గుర్తుపట్టలేని స్థితిలో కుళ్లిపోయి ఉందని, శరీరంపై నల్లటి బనియన్ ఉండడంతో మృతదేహం పురుషుడిగా గుర్తించామని, శరీరమంతా కుళ్లి కాలుభాగమే కనబడుతుందని ఎస్‌ఐ అన్నారు. ఒడిశా సరిహద్దుకు సుమారు 2కిలోమీటర్ల దూరంలో మృతదేహం పడి ఉందన్నారు. ఎవరైనా వ్యక్తి అదృశ్యంపై తమ దృష్టికి వస్తే ఘటన స్థలానికి తీసుకువెళతామన్నారు. ఈ విషయం ఒడిశా పోలీసులకు తెలియజేస్తామన్నారు.

ఫెన్సింగ్ పోటీల్లో కృష్ణ శ్రీకర్‌కు రెండు పతకాలు


పతకాలు అందుకుంటున్న గేదెల కృష్ణ శ్రీకర్

దేవరాపల్లి: మండలంలోని చిననందిపల్లికి చెందిన గేదెల కృష్ణ శ్రీకర్ రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్(కత్తి సాము) పోటీల్లో రెండు పతకాలు సాధించాడు. గత నెల 27 నుంచి 29 వరకు కర్నూల్‌లో 66వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్–14 విభాగంలో జరిగిన రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్‌లో విశేష ప్రతిభ కనబరిచాడు. వ్యక్తి గత ఈవెంట్‌లో గోల్డ్ మెడల్‌ను కైవసం చేసుకున్నాడు. గ్రూపులో కాంస్య పతకాన్ని సొంతం చేసుకున్నాడు. కృష్ణ శ్రీకర్ బంగారు, కాంస్య పతకాలను సాధించడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు. కృష్ణ శ్రీకర్ సంగివలసలోని ప్రైవేట్ హైస్కూల్‌లో 8వ తరగతి చదువుతున్నాడు.

దేదీప్యమానం

కనుల పండువగా లక్ష దీపారాధన


ఎన్టీఆర్ స్టేడియంలో లక్ష ప్రమిదల దీపారాధన

నర్సీపట్నం: భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని స్థానిక ఎన్టీఆర్ మినీ స్టేడియంలో లక్ష ప్రమిదల దీపాలంకరణ నేత్రపర్వంగా జరిగింది. శ్రీ షిరిడీ సాయి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గత 21 ఏళ్లుగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి భక్తుల నుంచి విశేష స్పందన లభించింది. లక్ష ప్రమిదల కార్యక్రమాన్ని డీసీసీబీ చైర్‌పర్సన్ చింతకాయల అనిత, మున్సిపల్ చైర్‌పర్సన్ గుడబండి ఆదిలక్ష్మి, ఏఎస్పీ కె.ప్రవీణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ కనకారావు జ్యోతులు వెలిగించి ప్రారంభించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు కర్రి రాంగోపాల్, డాక్టర్ రామచంద్రరాజు తదితర కమిటీ పెద్దలు ముఖ్య అతిథులను ఘనంగా సన్మానించారు. ఈ ఏడాది దీపాలతో రూపుదిద్దిన శివుని రూపం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ అపురూప దృశ్యాన్ని వీక్షించేందుకు పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఉదయం భీష్మ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని సాయినాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అయ్యారక కార్పొరేషన్ డైరెక్టర్ కర్రి కనకమహాలక్ష్మి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు ఏకా శివ, మహిళా విభాగం పట్టణ అధ్యక్షురాలు బయపురెడ్డి గణమ్మ, నీటి సంఘం మాజీ చైర్మన్ లాలం అప్పారావు పాల్గొన్నారు.

ఎస్‌పీఎల్‌లో అర్ధ సెంచరీల మోత


శ్రీ కాశ్యప్ డిగ్రీ కాలేజ్ జట్టు


దాడి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ జట్టు


ఫైనల్స్‌కు చేరుకున్న ఎస్ఎస్ఆర్ఐటీ జట్టు

నేడు ఫైనల్ మ్యాచ్‌లు

దొండపర్తి (విశాఖ దక్షిణ): సాక్షి ప్రీమియర్ లీగ్ తుది అంకానికి చేరుకుంది. బుధవారం ఏయూ గోల్డెన్ జూబ్లీ మైదానంలో జరిగిన మ్యాచ్‌ల్లో అర్ధ సెంచరీల మోతతో భారీ స్కోర్లు నమోదయ్యాయి. ఉదయం మూడో స్థానం కోసం మ్యాచ్‌లు జరగగా... మధ్యాహ్నం సెమీఫైనల్స్ జరిగాయి. వీటిలో బ్యాట్స్‌మెన్ అర్ధ సెంచరీలతో ప్రత్యర్థి జట్లకు చుక్కలు చూపించి తమ జట్లను ఫైనల్స్‌కు చేర్చారు. గురువారం ఉదయం జూనియర్స్ విభాగంలో జరిగే ఫైనల్ పోరులో ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజ్ (కంచరపాలెం), సాయి గణపతి పాలిటెక్నిక్ కాలేజ్ (గిడిజాల) తలపడనున్నాయి. అలాగే సీనియర్ విభాగంలో ఎస్ఎస్ఆర్ఐటీ కాలేజ్ (శొంఠ్యాం), దాడి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (అనకాపల్లి) జట్ల మధ్య ఫైనల్స్ పోరు జరగనుంది. ఇందులో విజేతలకు నగర పోలీస్ కమిషనర్ సీహెచ్. శ్రీకాంత్ చేతుల మీదుగా బహుమతుల ప్రధానోత్సవం జరగనుంది. సాక్షి మీడియా ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పోటీలకు సీఎంఆర్ షాపింగ్ మాల్ జిల్లా స్పాన్సర్‌గా వ్యవహరిస్తోంది.

14 పరుగుల తేడాతో ఎస్ఎస్ఆర్ఐటీ జట్టు విజయం

బుధవారం ఉదయం జరిగిన తొలి మ్యాచ్‌లో ఎస్ఎస్ఆర్ఐటీ కాలేజ్ జట్టు (శొంఠ్యాం) 14 పరుగులు తేడాతో జీవీపీ కాలేజ్ ఫర్ డిగ్రీ అండ్ పీజీ జట్టుపై విజయం సాధించింది. టాస్ గెలిచిన జీవీపీ కాలేజ్ జట్టు బౌలింగ్ ఎంచుకుంది. దీంతో బ్యాటింగ్‌కు దిగిన ఎస్ఎస్ఆర్ఐటీ కాలేజ్ నిర్ణీత 10 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 84 పరుగులు చేసింది. వి.సునీల్ 20 బంతుల్లో ఒక సిక్స్, 2 ఫోర్లతో 34 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. అలాగే సీహెచ్. మోహన్‌వాసుకిరణ్ 24, సీహెచ్.వెంకటేష్ 12 పరుగులు చేశారు. ఎ.దీపక్, ఇమ్రాన్‌లు చెరో వికెట్ తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన జీవీపీ కాలేజ్ 9.3 ఓటర్లలో 70 పరుగులు మాత్రమే చేసి ఆలౌట్ అయింది. ఎం.కౌశల్ 10 బంతుల్లో 2 సిక్సులు ఒక ఫోర్‌తో 22 పరుగులు చేశాడు. యు.పవన్‌కుమార్, సీహెచ్.మోహన్‌వాసు కిరణ్‌లు చెరో 2 వికెట్లు తీశారు.

8 పరుగులు తేడాతో శ్రీ కాశ్యప్ విజయకేతనం

రెండో మ్యాచ్‌లో అవంతి ఇంజినీరింగ్ కాలేజ్ (నర్సీపట్నం), శ్రీ కాశ్యప్ డిగ్రీ కాలేజ్ (శ్రీనగర్) జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన అవంతి ఇంజినీరింగ్ కాలేజ్ జట్టు బౌలింగ్ ఎంచుకుంది. దీంతో తొలుత బ్యాటింగ్‌కు దిగిన శ్రీ కాశ్యప్ డిగ్రీ కాలేజ్ జట్టు 10 ఓవర్లలో 5 వికెట్లు నష్టపోయి 73 పరుగులు చేసింది.

జి.శ్రీకర్ 10 బంతుల్లో 3 ఫోర్లతో 19, కె.రాకేష్ 12 బంతుల్లో 3 ఫోర్లతో 19, డి.జి.నాయుడు 10 బంతుల్లో ఒక ఫోర్‌తో 18 పరుగులు చేశారు. బి.సతీష్, ఎల్.హేమంత్‌లు చెరో వికెట్ తీశారు. 73 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన అవంతి ఇంజినీరింగ్ కాలేజ్ జట్టు 10 ఓవర్లలో 6 వికెట్ల నష్టపోయి కేవలం 65 పరుగులు మాత్రమే చేసింది. దీంతో శ్రీ కాశ్యప్ జట్టు 8 పరుగుల తేడాతో విజయం సాధించింది.

9 వికెట్ల తేడాతో దైట్ కాలేజ్ భారీ విజయం

మధ్యాహ్నం జరిగిన తొలి సెమీఫైనల్స్ మ్యాచ్‌లో రఘు ఇంజినీరింగ్ కాలేజ్(దాకమర్రి), దాడి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ జట్లు (అనకాపల్లి) తలపడ్డాయి. తొలుత బ్యాటింగ్‌కు దిగిన రఘు ఇంజినీరింగ్ కాలేజ్ జట్టు నిర్ణీత 10 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 79 పరుగులు చేసింది. దినేష్ 25 బంతుల్లో 3 సిక్సులు, 5 ఫోర్లతో 51 పరుగులు చేశాడు. కొండబాబు, విశాల్ చెరో 2 వికెట్లు, వెంకటేష్ 1 వికెట్ తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన దాడి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ జట్టు 9 ఓవర్లలో కేవలం ఒక వికెట్ మాత్రమే నష్టపోయి 80 పరుగుల విజయలక్ష్యాన్ని సునాయాసంగా ఛేదించి ఫైనల్స్‌కు చేరుకుంది. ప్రసాద్ 25 బంతుల్లో 3 సిక్సులు, 5 ఫోర్లతో 56 పరుగులు, చైతన్య 16 పరుగులు చేసి జట్టుకు విజయాన్ని అందించారు. దిలీప్ 1 వికెట్ తీశాడు.

46 పరుగుల భారీ ఆధిక్యంతో ఎస్ఎస్ఆర్ఐటీ కాలేజ్ జట్టు విజయం

మధ్యాహ్నం జరిగిన నాలుగో మ్యాచ్ సెమీఫైనల్స్‌లో ఎస్ఎస్ఆర్ఐటీ కాలేజ్ 46 పరుగుల భారీ ఆధిక్యంతో శ్రీ కాశ్యప్ డిగ్రీ కాలేజ్‌పై విజయం సాధించి ఫైనల్స్‌కు చేరుకుంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఎస్ఎస్ఆర్ఐటీ జట్టు నిర్ణత 10 ఓవర్లలో 5 వికెట్లు నష్టపోయి 95 పరుగుల భారీ స్కోరు నమోదు చేసింది. వి.సునీల్ 28 బంతుల్లో 4 సిక్సులు, 1 ఫోర్‌తో చెలరేగిపోయి 52 పరుగులు చేశాడు. మురళి 17 పరుగులు చేశాడు. కె.మణికంఠ 2 వికెట్లు, డి.జి.నాయుడు ఒక వికెట్ తీశారు. భారీ విజయలక్ష్యంతో బరిలోకి దిగిన శ్రీ కాశ్యప్ డిగ్రీ కాలేజ్ జట్టు 10 ఓవర్లలో 9 వికెట్లు నష్టపోయి కేవలం 49 పరుగులు మాత్రమే చేయగలిగింది. ఎ.సాయికృష్ణ అజేయంగా 11 పరుగులు మాత్రమే చేయగా మిగిలిన వారంతా సింగిల్ డిజిట్‌కే పరిమితమయ్యారు. ఎల్.తేజ తరుణ్ 3, వి.మణివరప్రసాద్ 2, సీహెచ్.మోహన్ వాసుకిరణ్ ఒక వికెట్ తీశారు.